క్లుప్తంగా

'కంటి వెలుగు' ఏర్పాట్ల పరిశీలన

చర్ల: ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న శిబిరాలకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం తహసీల్దార్ బి.భరణిబాబు పరిశీలించారు. పెద్దిపల్లిలోని గ్రామపంచాయతీలోని ఏర్పాటును పరిశీలించిన ఆయన.. కంటి పరీక్షల కోసం వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురితో మాట్లాడుతూ.. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో కంటి సంబంధిత ఇబ్బందులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంట సత్యనారాయణపురం వైద్యాధికారిణి డాక్టర్ దివ్య నయన, డీపీఎంఓ చింతా సత్యనారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రాకు తరలిన పందెం రాయుళ్లు

దమ్మపేట: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆంధ్ర ప్రాంతంలో నిర్వహించే కోడి పందేలకు మండలంలోని యువకులు, వయోజనులు భారీ ఎత్తున సరిహద్దులో ఉన్న ఆంధ్ర రాష్ట్రానికి తరలివెళ్లారు. ఆదివారం అక్కడి సీతానగరం, శ్రీనివాసపురం, మలసాన్‌కుంట తదితర ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిర్వహించే కోడి పందేలు, పేకాట, తదితర జూద క్రీడలను వీక్షించడానికి మండలం నుంచి భారీ సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాలలో వెళ్లారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులలోని రహదారులపై కార్లు, బైక్‌ల రాకపోకలు పెరిగాయి. మండలం నుండి భారీ సంఖ్యలో ఆంధ్రకు తరలి వెళ్లడంతో, స్థానిక ప్రధాన సెంటర్ జనాలు లేక మూగబోయింది.

సీపీఐ నేతకు పరామర్శ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య చారి సతీమణి అనసూర్య ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఆమె దశదిన కర్మలను సోమవారం నిర్వహించగా.. పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు హాజరై అనసూర్య చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, బీఆర్ఎస్ నాయకులు, సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకులు పాకాలపాటి పెద్ద బ్బాయి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా, జిల్లా నాయకులు ఆర్.లక్ష్మీనారాయణ, ఎస్‌కె.సర్వర్, మున్నా లక్ష్మీకుమారి, అక్కి నర్సింహరావు, జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్ కార్యక్రమానికి హాజరై నివాళ్లర్పించారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థులు..

బూర్గంపాడు: సారపాకలోని సెయింట్ థెరిస్సా స్కూల్‌లో సంక్రాంతి రోజున పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఈ స్కూల్‌లో 2004-2005లో పదో తరగతి చదివిన విద్యార్థులు చాలా ఏళ్ల తరువాత కలుసుకున్నారు. సంక్రాంతి సందర్భంగా పూర్వవిద్యార్థులు పాఠశాలలో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏఏ వృత్తుల్లో ఉన్నారో.. కుటుంబాల స్థితిగతులు ఎలా ఉన్నాయో చర్చించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల సత్కరించారు. కార్యక్రమ నిర్వహణకు వీరన్న, నాగేశ్వరరావు, ప్రేమ్, అలేఖ్య బాధ్యత తీసుకున్నారు.

మృతికి నివాళి

అశ్వాపురం: ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన రిటైర్ ఉపాధ్యాయుడు తిప్పారెడ్డి నారాయణరెడ్డి(80) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. మొండికుంట గ్రామంలోని నివాసంలో నారాయణరెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాయావతి జన్మదిన వేడుకలు

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలో ఆదివారం బీఎస్పీ నేత మాయవతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పినపాక నియోజకవర్గ బీఎస్పీ నేత ఇర్పా రవికుమార్, బూర్గుల కరుణాకర్, ఆలెం కోటేల సారథ్యంలో మణుగూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాయవతి జన్మదినం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కేక్ కట్‌చేసినారు. రఘు, సతీష్, రంగబాబు, కృష్ణ, వెంకటేశ్వర్లు, రమణ, శివ, రాంబాబు, బాలరాజు, శ్రీనులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

వాడవాడలా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం పండుగ, సోమవారం కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులు, గాలిపటాలు, గోపూజ తదితర కార్యక్రమాలతో సంక్రాంతి సందడిగా గడిచింది. మహిళలు తెల్లవారు జామున్నే ఇంటి ముందు రంగురంగులతో ముగ్గులు వేసి వాటి మధ్య గొబ్బెమ్మలు, నవధాన్యాలు పెట్టారు. పల్లెల్లో వీధివీధినా డోలీ చప్పుళ్లతో, సన్నాయి మేళాలతో గంగిరెద్దులు సందడి చేశారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండివంటలు, బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు. పలుచోట్ల ముగ్గులపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



బూర్గంపాడు: గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు



బూర్గంపాడు: వేలేరులో కోడిపందేలు..



మణుగూరుటౌన్: ఇంటి ఎదుట సంక్రాంతి ముగ్గు వేస్తున్న మహిళ



మణుగూరుటౌన్: ఓ ఇంటి ఎదుట గంగిరెద్దు సందడి



మణుగూరుటౌన్: విప్పల సింగారంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు..



భద్రాచలంఅర్బన్: ముగ్గుల పోటీలో విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న రాంప్రసాద్

ఆ స్థలం ఎవరికి?

- నిరుపయోగంగా ఆర్‌అండ్‌బీ కార్యాలయ స్థలం
- బస్టాండ్ నిర్మాణానికి ఆర్టీసీ కసరత్తు
- తమ శాఖకే వినియోగించుకునేలా ఆర్‌అండ్‌బీ యోచన
- చివరికి ఆ స్థలం ఎవరి వశమౌతుంది!?



అశ్వాపురంలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయం

అశ్వాపురం: మండల కేంద్రంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం భవన సముదాయం, స్థలం మరలా ఆర్‌అండ్‌బీ కార్యాలయానికే ఉపయోగిస్తారా.. లేక ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయిస్తారా అనే సందిగ్ధం నెలకొంది. అశ్వాపురంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని వేరే చోటకు తరలించడంతో గత కొన్నేళ్లుగా ఆర్‌అండ్‌బీ కార్యాలయం నిరూపయోగంగా ఉండి భవనం శిథిలావస్థకు చేరింది. నిరూపయంగా ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖ స్థలంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని మండల కేంద్ర ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. మండల కేంద్రంలో అమెర్డ రహదారి వెంబడి ఉన్న ఆర్టీసీ స్థలాన్ని ఆర్‌అండ్‌బీ శాఖకు ఇచ్చి.. బదులుగా ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖ స్థలాన్ని ఆర్టీసీ కేటాయించేలా ప్రతిపాదనలు వచ్చాయి. తద్వారా రోడ్డుపట్టక ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో నూతనంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మించేందకు ఈ ఆలోచన చేశారు. రూ.2 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని స్థానిక సర్పంచ్ బాణోత్ శారద ఎమ్మెల్యే రేగా కాంతారావుకు పలుమార్లు విన్నవించారు. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మణుగూరు ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన సమయంలో ఈ అంశం చర్చకు వచ్చినట్టు సమాచారం. ఆ అంశం చర్చకు వచ్చిన మాట వాస్తవమే కాని అలాంటి ప్రతిపాదనలు ఏమీ చేయలేదని ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ రెండు శాఖల అధికారులు చెబుతున్నారు.

ఇటీవల ఆర్‌అండ్‌బీ శాఖ లో జరిగిన మార్పులలో బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాలను కలిపి ఆర్‌అండ్‌బీ శాఖ మణుగూరు సబ్ డివిజన్ కార్యాలయం నూతనంగా ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. అశ్వాపురంలో ఆర్‌అండ్‌బీ శాఖ స్థలం అందుబాటులో ఉండటంతో సబ్ డివిజనల్ కార్యాలయం ఇక్కడే ఏర్పాటు చేసే ఆలోచనలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయ స్థలాన్ని ఆ శాఖ సబ్ డివిజనల్ కార్యాలయానికి ఉపయోగిస్తారా.. ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఆర్టీసీకి ఇచ్చే ప్రతిపాదనేదీ లేదు

అశ్వాపురంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయ స్థలం ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి ఇచ్చే ప్రతిపాదన ఏమి లేదు. మా శాఖ నుంచి అలాంటి ప్రతిపాదన చేయలేదు. ఆర్‌అండ్‌బీ శాఖ మణుగూరు సబ్ డివిజన్ కార్యాలయంగా ఉపయోగించే అవకాశం పరిశీలనలో ఉంది.

– రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ

అధైర్యపడొద్దు అండగా ఉంటా..



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

అశ్వాపురం: పలువురు బాధితులను పరామర్శించి అధైర్యపడొద్దు అండగా ఉంటానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు వారికి భరోసా కల్పించారు. ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం పర్యటించారు. సత్యనారాయణపురం గ్రామంలో విద్యుత్ షాక్‌తో గాయాలపాలైన వల్లపు సాయిని రేగా పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. గరిబడ్డు గ్రామంలో ఇటీవల పని చేస్తుండగా గోడకూలి మీద పడి గాయాలపాలైన రేసు రంగయ్యను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబం వలబోజు భిక్షపతి కుటుంబీకులకు రూ.3500 ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తూ పూరిల్లు దగ్ధమైన తాటి ఆదిలక్ష్మి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో తెల్లం జోగయ్య ఇటీవల మరణించగా భార్య వెంకటరమణ, పిల్లలను పరామర్శించారు. తండ్రిని కోల్పోయిన ఆ పిల్లలను రేగా విష్ణు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చదివిస్తానని భరోసా కల్పించారు. రామచంద్రాపురం గ్రామంలో మద్ది గంగారెడ్డి భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఇటీవల గంగారెడ్డి కేన్సర్‌తో బాధపడుతుండటంతో ఆయనను పరామర్శించారు. మోగిళ్ల పెదవీరారెడ్డి, పగడాల రామిరెడ్డి ఆహ్వానం మేరకు వారి నివాసాలకు వెళ్లి రేగా కుటుంబసభ్యులతో మాట్లాడారు. వారు రేగాను సన్మానించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, సర్పంచ్ కాకా అశోక్, ఉపసర్పంచ్ టేకుల సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ జయ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మోగిళ్ల పెద వీరారెడ్డి, చిన వీరారెడ్డి, మొండికుంట ఉపసర్పంచ్ సుధీర్, మిట్టకంటి సురేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

గుండాల: పురిటి నొప్పులతో బాధ పడుతున్న మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన కండి మానసకు పురిటి నొప్పులు వస్తుండటంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో కొత్తగూడెం తరలిస్తుండగా ఏరియా ఆస్పత్రి సమీపంలో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ, పైలట్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

చర్ల: మండలంలోని గొమ్ముగూడెంకు చెందిన ఓ యువకుడు అనారోగ్యం బారిన పడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తేగడ గ్రామానికి చెందిన యూత్ ఆర్థికసాయం అందించారు. సోమవారం గొమ్ముగూడెం వెళ్లి బాధితుడైన సాధనపల్లి రవిని పరామర్శించి కుటుంబానికి రూ.5 వేల నగదు, 2 వేల విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో తేగడకు చెందిన నిట్టా రాజు, శెట్టిపల్లి శ్రీను, రాజేష్ ఉన్నారు.

ఘన స్వాగతం పలకాలి

భద్రాచలంఅర్బన్: అమెరికా దేశంలో రోటరీ ఇంటర్నేషనల్ అసెంబ్లీ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగి స్వదేశానికి వస్తున్న రోటరీ ఇంటర్నేషనల్ 2023-24 డిస్ట్రిక్ గవర్నర్ ఆర్టిఎస్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డికి ఆహ్వానం పలికేందుకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. మణుగూరు క్రాస్ రోడ్‌లో ర్యాలీ ప్రారంభమై శంకర్ రెడ్డి ఇంటి వద్ద ముగుస్తుందన్నారు.

పాఠశాల భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం



ప్రభుత్వ పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దిబ్బగూడెం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎట్టకేలకు సోమవారం ప్రభుత్వ పాఠశాల భవనంలోకి మార్చారు. ఈ నెల 13వ తేదిన 'సాక్షి' దినపత్రికలో 'అంగన్‌వాడీ భ'వనం'..అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై స్థానిక ఐసీడీఎస్ అధికారులు స్పందించారు.

సాక్షి ఎఫెక్ట్..

శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనంతో ప్రమాదం పొంచి ఉండటంతో స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ రోజా రాణి పరిశీలించి, కేంద్రాన్ని తాత్కాలికంగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి తరలించారు. చిన్నారులకు పాఠశాల భవనంలో పోషకాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ఇప్పటికే నూతన భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశామని, గ్రామంలో అద్దె భవనాలు అందుబాటులో లేకపోవడంతో పాఠశాల భవనంలోకి మార్చామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

యువజన సమ్మేళనానికి పయనం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యువతీ, యువకులు ఈ నెల 18 నుంచి 24 వరకు మైసూరులో జరుగనున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్‌కు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా సీఆర్‌పీఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో భద్రాచలం ఏజెన్సీకి చెందిన 20 విద్యార్థులు సోమవారం మైసూరు పయనమయ్యారు. వీరితోపాటు ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సహాయకులను ఉంచి, విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులు, దుస్తులు, సామగ్రిని సీఆర్పీఎఫ్ అధికారులు వారికి సమకూర్చారు. దాదాపు వారం రోజుల పాటు అక్కడే వివిధ సంస్కృతి, భాష, జీవనశైలి, విద్యామార్గాలు, అభివృద్ధి కార్యకలాపాలు, విద్యా అవకాశాలను అర్థం చేసుకోవడానికి గిరిజన యువతకు వివిధ ప్రాంతాలకు సందర్శించే అవకాశాన్ని కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. అక్కడి స్థానిక సంఘాల, యువతతో సంభాషిస్తారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో 141 సీఆర్పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్ ధర్‌తో పాటు కమల్‌వీర్ యాదవ్, శింగార్వేల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న సీఆర్పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్ ధర్

దొరికిన బ్రాస్‌లెట్ అప్పగింత

అశ్వాపురం: తనకు దొరికిన బంగారు బ్రాస్‌లెట్‌ను.. పోగొట్టుకున్న వ్యక్తికి అందజేసి మానవత్వం చాటుకున్నాడు అశ్వాపురానికి చెందిన దాసరి భిక్షం. వివరాల్లోకెళితే.. భిక్షం శనివారం రాత్రి అశ్వాపురం సెంటర్‌లోని అపోల్ మెడికల్‌దుకాణం వద్దకు మందుల కోసం వెళ్లాడు. అక్కడ సుమారు రూ.2 లక్షలు విలువ గల బంగారు బ్రాస్‌లైట్ భిక్షంకు దొరకింది. మెడికల్ షాపు వారికి తెలియజేసి పోలీసులకు సమాచారం అందించారు. బ్రాస్‌లెట్ పోగొట్టుకున్న గౌతమీనగర్ కాలనీకి చెందిన హైదరాబాద్ ఎస్ఎఫ్‌సీ ఉద్యోగి కన్నెగంటి గోపి విషయం తెలుసుకుని అపోలో మెడికల్ షాపు వారిని సంప్రదించాడు. అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో పోలీసుల సమక్షంలో భిక్షం బంగారు బ్రాస్‌లైట్‌ను గోపికి అందజేశారు. భిక్షం మానవత్వంపై పోలీసులు, స్థానికులు ప్రశంసించారు. కార్యక్రమంలో రాయల రాము, పొడుతూరి రవి, పోలీస్ సిబ్బంది శ్రీనివాసరావు, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఖమ్మం సభతో రాజకీయ మార్పులు'

అశ్వారావుపేటరూరల్: పోరాటాల గడ్డ ఖమ్మం నుంచే దేశ రాజకీయాల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని, ఆ దిశగానే ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారని రాష్ట్ర మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సభ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఖమ్మంలో చేపట్టిన బీఆర్ఎస్ భారీ సభకు నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలి రావాలని ఆయన కోరారు.

తెలంగాణను మించిన రాష్ట్రం లేదు: ఎంపీ నామా

దేశంలో సంక్షేమ, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రమే ఆదర్శమని, దీనిని మించిన రాష్ట్రమే లేదని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీను తీసుకొచ్చారని అన్నారు. ఈ సభవైపే దేశంలోని అన్ని పార్టీలు చూస్తున్నాయన్నారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. ఖమ్మం సభకు ఐదు లక్షల మంది తరలివస్తారనే అంచన ఉండగా, దీనికి మించి స్పందన వస్తోందన్నారు. సమావేశంలో రైతుబంధు జిల్లా బాధ్యులు నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యాద్ రసూల్, స్థానిక నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న తుమ్మల, పక్కన ఎంపీ నామా, విప్ రేగా

భద్రాచలం: ఖమ్మం కేంద్రంగా ఈ నెల 18న జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో సభ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు డివిజన్ నుంచి 50 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ జాతీయ స్థాయిలో జరిపే ఈ సభకు డివిజన్ నుంచి పెద్ద ఎత్తున ప్రజానీకాన్ని తరలించాలని పిలుపునిచ్చారు. మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేడాలని వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బోదె బోయిన బుచ్చయ్య, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఖమ్మం జిల్లా కేంద్రంలో రేపు జరగబోయే సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మణుగూరు జడ్పీటిసి పోశం నరసింహారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామపంచాయితీల్లో జనసమీకరణ సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. ఖమ్మం బహిరంగ సభకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ తో పాటు మూడు రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నారని తెలిపారు. వేలాదిగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.



భద్రాచలం: సమావేశంలో మాట్లాడుతున్న బాలసాని లక్ష్మీనారాయణ

పినపాక: ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి అన్నారు. మేరకు సోమవారం మండల పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించిన ఆయన.. మండలం నుంచి సుమారు 2000 మంది వరకు సభకు తరలించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలు, నాయకులు ప్రజలను సంసిద్ధం చేయాలన్నారు. రేగా కాంతారావు ఆదేశాల మేరకు కేసీఆర్ నాయకత్వంలో పినపాక మండలానికి కేటాయించిన నిధులు, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి సత్తిబాబు,నాయకుల వాసుబాబు, ముక్కు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదారంగనాథుల కల్యాణోత్సవం



అన్నపురెడ్డిపల్లి: గోదా రంగనాథుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



భద్రాచలంటౌన్: కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణాన్ని ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారికి కాళ్లరి వంశీయులు కాళ్లరి శివరాజ్-కృష్ణప్రియ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొని, గోదారంగనాథుల కల్యాణాన్ని తిలకించారు.

నందివాహన సేవ..

మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం నందివాహన సేవను వైభవంగా జరిపించారు. స్వామి వారి దర్శనం, అర్చనలు, అభిషేకాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివార్ల పూజ కార్యక్రమాల్లో శివాలయ వ్యవస్థాపక నిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు, బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ మాజీ చైర్మన్ వనమాగాంధీ, ఆలయ మేనేజర్ రమణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం గోదారంగనాథ స్వామి వార్ల కల్యాణాన్ని వైభంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బాధంపూడి శివ శర్మ, అరుణ్ స్వామి నేతృత్వంలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో అడుసుమిల్లి జగదీష్, పద్మ దంపతులు పాల్గొని జరిపించారు.

అంతకు ముందు ఆలయంలో కొలువైన అయ్యప్ప స్వామివారికి సుప్రభాత సేవా, పంచామృతాభిషేకాలు, అలంకార సేవలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.